కాని ఇల్లుకన్నా గుడి పదిలం అనేవారు పూర్వం. ఇప్పుడామాట రద్దయింది. గుళ్ళోకెళ్ళిన వాళ్ళు క్యూలో చస్తూంటే గుడి పదిలం అన్న సామెతను తెలుగులోంచి తొలగించాలి.

అయితే ఒక విషయంమాత్రం ఢంకా బజాయించి చెప్పగల్ను నాలుగుడబ్బులున్న వాడెవడూ ధర్మ దర్శనానికి ఎగబడడు. సినిమా వాళ్ళూ, వ్యాపారస్థులూ, పెద్ద పెద్ద ఆఫీసర్లూ వాళ్ళెవరూ "క్యూ"లో నిలబడరు. క్యూల్లో నిలబడేది రికమెండేషన్లు లేని అలగాజనమే కనుక తొక్కిడిలో నలిగి ప్రాణాలు పోయినవారి కందరికి దేవుడు మోక్షం ఎలాగూ యిచ్చేస్తాడు.

స్వర్గంలో పై బెర్తులకి కూడా రేట్లు పెట్టేసి అమ్మేస్తే ఎలక్షన్లలో ఓడిపోయిన వారూ, వృద్ధ సినిమాతారలు, బ్లాక్ మార్కెటర్లు ఎగబడి కొనుక్కుంటారు.

తొక్కిడిలో చచ్చిపోయిన వాళ్ళకు స్వర్గం యిచ్చినట్లే దానికి కారకులైన వాళ్ళను కూడా స్వర్గానికి పంపించే ఏర్పాట్లు చేయాలి.

కాని స్వర్గం మోక్షం ఎంత మంచివైనా ఎవరో దిక్కుమాలిన వాళ్ళకూ అభాగ్యులకూ తప్ప ఎవరికీ స్వర్గస్థులం కావాలని వుండదు. అదేమి చిత్రమో...

# కన్నె మనసులు

"కరుకులు మావాయె
కన్య మాదాయె
లబలబలు మీవాయె
రమణి మాదాయె –" అవి ఒక మగ పెళ్ళివారు ఆడ పిల్లనిచ్చుకున్న వారిని దెప్పారట!
అందులో రమణి అన్నమాట నాకెంతో ఇష్టం!

"లబలబలు మీవాయె రమణి మాదాయె" అనుకుంటూనే పూటల్లా తెలుగు పలుకుబడిలోని సొగసులు నెమరేసుకుంటూ నోరుతీపిచేసుకున్నాను.

రమణి తర్వాత రాణీ అన్న పేరేనాకెంతో ఇష్టం రాణీ అన్న పేరెట్టుకుని దాసీబుద్ధులున్న వాళ్ళంటే ఐ డోంట్ కేర్ – నాకు సంగీతం రాకపోవడానికి కారణం నేను చిన్నప్పుడు బెచ్చాలు, గోలీలు ఆడేదాన్ని మా వీధి పిల్లలందరితో చెట్లెక్కేదాన్ని, గోడలమీదపడకుండా నడిచేదాన్ని. తోటలవెంట, దొడ్లవెంటతిరగడం గొప్ప సరదా నాకు. మా ఊళ్లో దిగుడుబావి వుండేది. అందులోపడి ఉదయం కుర్రకారు ఈతలు కొట్టేవారు. అక్కడ కూర్చుని చూస్తూంటే నాకు పొద్దుపోయేది – అప్పుడప్పుడు ఆడవాళ్ళు అందులోపడటం – అలా పడ్డప్పుడు రకరకాల కథలు ఊళ్ళో ప్రచారం అయేవి. ఆభావి చుట్టూ భయంవేసే కథలు ప్రచారంలో కొచ్చేవి.

పగలు కొబ్బరి మట్టల నీడల్లో సూర్యుడు పొడుచుకొస్తుంటే నూతి దగ్గర వెలుగు నీడలు దోబూచులాడుకొనేవి. రకరకాల పక్షుల ధ్వనులు వింటూ ఆ వెలుగులో కొబ్బరిచెట్ల నీడలో అత్యద్భుతంగా కనిపించే ఆ దిగుడు బావిని అక్కడకువచ్చే మా ఊరి జనాన్ని చూసి ఎందుకో పరవశించిపోయేదాన్ని.

ఆ దిగుడుబావికి అసింటా – కసింత దూరాన తోటలో తామర కొలనులోకి గన్నేరుచెట్లు తొంగి చూస్తున్నట్లుండేవి. ఆగట్టుమీంచి పిల్ల కాలవను దాటి తోటలోకి వెళ్తే కలకలలాడుతూ కమలాలతో అచ్చటచ్చట తామరలతో మిలమిలా మెరిసిపోతూ దర్శనమిచ్చేది. ఆ కొలనుకు ఆ తట్టున గడ్డి మేట్లు వేసిన మైదానం అక్కడ కొన్ని గుడిసెలు కనిపించేవి. ఇటుక ఆవలు పేర్చి కాల్చిన పొగ చెరువుమీద నుంచి వచ్చి, దిగుడుబావి దగ్గర కూర్చున్న మాకు కొట్టవచ్చినట్లు సుళ్ళు తిరుగుతూ పైపైకి చేస్తూ కనబడేది. ఆ చెట్లమధ్య తిరుగుతూ ఆ కొలనులోకి చూస్తూ స్నేహితురాళ్ళతో చెట్టా పట్టాలువేసుకుని తిరగకుండా ఆడుకోకుండా పన్నెండోఏటే పెళ్ళి చేసేసి కాళ్ళు రెండూ విరగ్గొట్టి ఇంట్లో పడేశారు నన్ను – ఒక హార్మనీ కొని పెట్టి సంగీతం నేర్పించారు. ఒక సంస్కృతం మేష్టరు. నేనేం బతకాలా –చావాలా? నాకేం పట్టింది. నేను చదవను. నేను పాడను నాకు హిందీ వద్దు. సంస్కృతం వద్దు నాకు నోవెల్సూ కథల పుస్తకాలూ కావాలి. బొమ్మల పత్రికలు కావాలి. నేను సినిమాలు చూడాలి. పెళ్ళయితే మాత్రం పెళ్ళయిన అమ్మాయికి సంస్కృతమూ హిందీ సంగీతమూనా సినిమా పాటలు కథల పుస్తకాలు పత్రికలు కావాలిగాని. నేను అటక ఎక్కి కూర్చుని దాక్కునే దాన్ని మేష్టర్లు అదరూ ఈ అమ్మాయి రాదని విసుక్కుని వెళ్ళిపోయేవరకూ, అప్పుడప్పుడు ఉత్తరాలొచ్చేవి చి॥సౌ॥కి ఎన్ని మార్కులు వచ్చినదీ లిస్టుబంపవలెను. బరీక్షలకు కూర్చొనుట లేదా అని అడిగేవారు. బంపవలెనా బరీక్షలకా – బరీక్షలకు బంపము అని పెద్ద పెద్ద అక్షరాలతో నోటుబుక్స్ నిండా వ్రాసే దాన్ని, అప్పుడు తీరిక సమయాల్లో లవ్ లెటర్ అనగా ప్రేమలేఖ వ్రాయడం ప్రాక్టీసుచేసి చింపి చింపి కాగితాలు గుట్టలు పోసేదాన్ని.

నాకు అందరిమీద చాలా కోపంగా వుండేది. ప్రతిపండగకి క్రొత్త బట్టలు కోసమని గొడవచేసేదాన్ని. మంచి మంచి ఓణీలు పరికిణీలు ముందు కట్టేసుకుని మాపేసి క్రొత్తవి కొనమని కొనకపోతే తిండిమానేసి అలక సాగించేదాన్ని, నీ మొగుడొచ్చాక రెండు పాటలు పాడమంటే ఏంచేస్తావ్? సంగీతమన్నా నేర్పించలేదా అని మమ్మల్ని తిట్టడూ, అనేది మా అమ్మ. సరిగ్గా చదువుకోవె – అతను వచ్చి ప్రశ్నలూ అవీ వేస్తాడేమో అని మా అమ్మ గొణిగేది. నేను మా అమ్మనో ఇడియట్‌గా భావించి నవ్వేసేదాన్ని. అతను వచ్చి ప్రశ్నలు వేస్తాడూ – ప్రశ్నలు వెయ్యమను అప్పుడు చెప్తాన్లే అని చేతిలోని ఈతరువ్వతో కనపడ్డ మొక్కలన్నీ కసిగా బాదుకుంటూ పరిగెత్తేదాన్ని. హిందీ ప్రశ్నలు సంస్కృతం ప్రశ్నలు వేయడానికి పెళ్ళికొడుకు అక్కడనుంచి యిక్కడకురావాలా? మా అమ్మకేం తెలీదు. ప్రశ్నలు పోస్టులో బంపుము – సమాధానము పోస్టులో బంపెదను అని మా అమ్మదగ్గర అనేసి కిలకిలానవ్వుతూ పారి

పోయేదాన్ని. "పొగరు మోతుపీనుగు" అని మా అమ్మ నవ్వుకోవడం నా కింకా బాగా జ్ఞాపకం. ఇంతలో ఏదో పండగకి మీరు దయచేశారు. అప్పుడు నన్ను మీరు శ్లోకాలూ, హిందీ పాఠాలు ఏకరువుపెట్టమనలేదు అసలు మీకే సంస్కృతమూ హిందీ ఏమీరావుట. సరే యిద్దరం కలిసే చదువుకోవచ్చులే అని ఆ పుస్తకాలు కట్టకట్టి బీరువామీద చెదలకు దగ్గరగా వుండేట్లు దాచాను.

అప్పుడు అయిష్టంగాచదువుకున్న చదువు ఇప్పుడు కాస్త కాస్త వినియోగంలో కొస్తున్నది.

స్త్రీ అన్న మాట అట్టే యింపుగా వున్నట్లు తోచదు ఇస్త్రీ పెట్టె - పాలస్త్రీ - మేస్త్రీ లాటి మాటలు గుర్తుకొస్తాయి.

ఆడది అనేమాట కూడా - ఆడది మొగదీనూ నాకు నచ్చలేదు.

"పూబోడి" అనే మాట వింటే నాకు మాచెడ్డచిరాకు ఆ బోడి అనే మాట నాకు సయించదు. పూబోడి తలిరుబోడి ఇగురుబోడి ఇవన్నీ ఆడవాళ్ళ మీద వేసే కార్టూన్లలా బోడిగా వుంటాయి.

ముద్దుగుమ్మ చక్కెరబొమ్మ ఇలాటి బొమ్మ మాటలు ఏమిటో చాలా డేంజరస్‌గా వుంటాయి. యువతి అనే మాటలోని "తి" నాకునచ్చదు.

అమ్మాయి అనే మాట బావుంటుంది కమ్మగా హాయిగా వుంటుంది. ఆ అమ్మాయంటే నాకిష్టం అంటే ఎంత బాగుంటుంది. ఆ పూబోడిపైనా మనసు దగుల్కొని యున్నది. దగుల్కొని యున్నదా, రాస్కెల్ అని లెంప పగలగొట్టాలనిపిస్తుంది.

అన్నిట్లోకి రాణీ అని ఏ అమ్మాయికైనా పేరుంటె ఆ అమ్మాయిని నేను గాఢంగా లైక్ చేసి తీరుతా. రాణీ తర్వాత దేవికూడా ఇష్టమే కాని కొంచెం డెవిలిష్‌గా వుంటుంది.

వాట్సార్... ఏమండోయ్ -

మీ సుశీలారాణి మొన్న రైల్లో కన్పించింది.

ఎందుకలా ముఖం చిట్లించుకున్నారు.

దట్ - డాన్సింగ్ గరల్ - నాట్యకత్తె - (ఏం తెలుగు బాబూ) నాట్యకత్తియ - సుశీలారాణి జ్ఞాపకం లేదుటండీ మీ జేబులోనుంచి బర్కిలీ సిగరెట్లు కొట్టేసేది రాజమండ్రి ప్లీడరు గారమ్మాయి. వాళ్ళ ఫాదర్ పేకాటో, జూదమో ఏదో ఆడేసి ఆస్తంతా తినేసి ఈ అమ్మాయి డాన్సు మీద జీవిస్తున్నాడని చెప్పారు మనింట్లో నెల్లాళ్ళుంది వెంకిపాటలు పెంకు లెగిరేలా పాడేసేది. ఆ అమ్మాయి నెల్లాళ్ళు మనింట్లో వుండి వెళ్ళే సరికి తిరిగి మళ్ళీ ఇల్లు నేయించుకోవాల్సి వచ్చింది. ఆ సుశీలారాణి మొన్న రైల్లో కనిపించింది. మొగుడు ఫిలాసఫి లెక్చరరుట; ప్రేమ వివాహమేనట ఇప్పుడు సిగరెట్లు కాలుస్తున్నావా అని రహస్యంగా అడిగాను. ప్లీజ్ - ప్లీజ్ - కాళ్ళావేళ్ళాపడింది. వాళ్ళాయన చాలా ఆర్థడాక్సు సనాతనుడట ఏడాదికి మూడుమాట్లు తిరుపతి తీసుకెళ్ళి యింటిల్లిపాదికీ గుండు చేయించి తీసుకొచ్చేస్తాట్ట. పెళ్ళి కాకముందు చేసిన డాన్సులే డాన్సులట గాని ఆ సంగీతాలు గెంతడాలు అన్నీ మర్చిపోయిందట. అప్పుడప్పుడు సినిమా సాంగ్స్ వినపడితే డొక్క వాలికలు చేస్తాట్ట.

గోడలనిండా భక్తి ఫోటోలేనట. ముగ్గురు పిల్లలు - మళ్ళీ కానుపు - ఆపరేషన్

చేయించుకోమంటే దేవుడ్ని అడగాలట, ఆయన అన్నీ దేవుడ్ని అడిగేచేస్తాడట. మీకు మరీమరీ నమస్కారాలని చెప్పమంది.

పూలబంతిలా చెంగుమని ఎగుర్తూ పాడుతూ గెంతే మీ సుశీలా రాణి యిప్పుడు కుంటిరిక్షాలా డొక్కు కారులా, పాత సీనారేకు డబ్బాలా వుంది. చూడొద్దు - మీరు చూస్తే కొంతమంది ఆడపిల్లల పాలిట తెలుగు మ్యారేజి ఎటువంటి శాపమో తెలుసుకొని బాధపడ్తారు. మీజేబులో బర్కిలీ సిగరెట్లు కొట్టేసి మంచం కింద కూర్చుని సిగరెట్లు కాల్చే సుశీలారాణి వొళ్లోపిల్లలు దొడ్డికెళ్ళి వుచ్చలు పోసేస్తుంటే ఎప్పుడు తనమొగుడు దేవుడు పర్మిషను తీసుకుంటాడా అని ఎదురుచూస్తూ వుంటుంది బిక్కు బిక్కు మంటూ. సుశీలారాణి ముఖంలో చిరునవ్వుల వెన్నెలలు సాక్షాత్కరించాలంటే దేవుడి పర్మిషన్ కావాలి; సిగరెట్లు కాల్చే ఆడభక్తుల్ని రౌరవాది నరకాల్లో తోస్తాడు కాని వరాలిస్తాడా? - దేవుడు - ఫిలాసఫీ లెక్చరరుపార్టీ. అందుకే బ్రేవో. సుశీలారాణి - నీవు వొంటరిగానే పయనించు.

నీకు తోడెవ్వరూ వుండరు<br>
నీకు తోడెవ్వరూ రారు;<br>
అకేలీ చలో :

# ఇతరులు లోనికి రాకూడదు

అసలు సున్ని పిండితో ఓ గుంటడ్ని తయారు చేసిందట ఆ మహాతల్లి. దేవతలన్న పేరే గాని వాళ్ళకు కామన్సెన్స్ వుండదల్లే వుంది. బాత్‌రూం కట్టించుకుంటే, కనీసం సింపుల్‌గా తలుపు వేసుగుంటే సున్నిపిండితో ఒక గుంటడ్ని చేసి గుమ్మందగ్గర కూర్చోబెట్టడం వుండదుకద: తలంటోసు గుంటోందయ్యా - ఆవిడ జగన్మాత: ఆ నలుగుపిండిని వేస్టు చేయడ మెందుకని ఆవిడకో అయిడియా వచ్చి వుంటుంది. జగన్మాతకు కూడా ఇలాంటి తలక్రిందులు ఆలోచన్లు ఎలా వస్తాయో నాకు బోధపడకుండా వుంది. ఇప్పటికి పల్లెటూళ్ళలో ఆడవాళ్లు నూతిదగ్గర దొడ్లో చెట్టుక్రింద ఇటుకరాతిమీద కూర్చుని పులుసు పోయించుకుని తలంటోసుగుంటూ వుంటారు. జగన్మాత తలంటోసు గుంటూంటే పులుసెవరు పోశారో....

పులుసు పోసేందుకు మరోపిండితో మరో ట్రబుల్సం బోయిని కాని, సారీ గరల్నుకాని సృష్టించి వుండవచ్చు. ఒక వేళ ఆ వెర్రి తల్లి పిల్లవాడ్ని చేసిందికాని ఒక మాంచి యంగ్ గరల్నుచేసి గుమ్మం దగ్గర కాపలా పెట్టివుంటే శివుడు గుమ్మం దాటకుండానే మరేదో అఘాయిత్యం చేసివుండును. బోయిని సృష్టించడంలో ఆ మహాతల్లి చిన్న లవుక్యం ప్లే చేసింది.